
**1983 ఉగాది కథానికల పోటీలో రు. 116/-లు కన్సొలేషన్ బహుమతి పొందిన కథ!**

# మంటలు

వాడ్రేవు వీరలక్ష్మీదేవి



'ధైర్యే, సాహసే, లక్ష్మి' అనుకుంటూ ఆ ఇంటి గేట్ తీశాను-

ఆ "శుభ సమయంలో" రాకుండా ఇంత కాలానికి వస్తున్నందుకు ఏం కోపపడుతుందో- అని భయపడుతూనే-శ్రీలక్ష్మిని ధైర్యమూ, సాహసమూ వుండి కూడా లక్ష్యసాధన కోసం దూరం చేసుకున్న-నేను.

## నా గురించి



నా కథకు బహుమతి ఇచ్చిన ఆంధ్రజ్యోతికి కృతజ్ఞతలు. "వెన్నెలముగ్గు "కథతో ఆంధ్ర జ్యోతి పాఠకులకు పరిచయమైన నేను కాకినాడ లోని సంస్కృతకళాశాలలో తెలుగు ఉపన్యాసకు రాలిని

నాకు తెలిసిన, అనుభవంలోకి వచ్చిన విష యాల గురించి తప్ప కల్పించి కథలు వ్రాయడం నాకు తెలీదు. అందుకేనేమో- రొటీన్ జీవితం లోని సంగతులను ఎంతో ఆసక్తి కలిగించేలా కథలుగా చెప్పే నాన్నగారన్నా, సీత అత్తయ్య అన్నా ఇష్టం.

అలాగే-జీవితంలోంచి కవిత్వం పుట్టడమేకాక, జీవితమే కల్పితంగా మారే దశకు కవులు, రచ యితలు రావాలని కలలుకనే చిన్న తమ్ముడు శివ వీరభద్రుడూ ఇష్టమే. సాహిత్యమూ, సంగీ తమూ, సినిమాలూ తెలిసిన మనసెరిగిన మిత్రు లతో కబుర్లు మరీ ఇష్టం.

చలంగారి నిజాయితీ నా ఆదర్శం.

"పడవ ప్రయాణం" పద్మరాజుగారూ, "చీకటిగదుల జర్కాని" త్రిపుర గారూ ఎంతో ఎంతో ఇష్టం.

త్రిపురగారు- "ఆయనే నా first fan. బహుశా last fan కూడా కాబోలు".-అని ఎవరి గురించి రాశారో ఆయనే నాగురువు. నాకూ మొదటి-చివరి- అభిమాని అని చెప్పడానికి సాహ సిస్తూ ప్రేమతో, ఆనందంతో ఆ కథని ఆయనకే సమర్పించుకుంటున్నాను.

— వాడ్రేవు వీరలక్ష్మీదేవి

గుమ్మంలోనే ఎదురయింది. ఎప్పటిలానే, పెదవుల చివర్ల నుంచి పాగి బుగ్గల లోతుల్లో విశ్రాంతి తీసుకుంటున్న చిరునవ్వు. విశాలమైన నుదుట ఎండైన బొట్టు,

"ఇప్పుడా రావడం—?" అంటోంది ఆ చిరునవ్వులోంచే విరిసిన చిరుకోపంతో.

ఇల్లు చాలా చిన్నది. అయినా ఎంతో ముచ్చటగా, పొందికగా, ఇంకా చెప్పా లంటే మనోహరంగా ఉంది. నా వెనకే ఉండి కొత్త ఇల్లంతా చూపించింది. నా కాంప్లిమెంట్లు అన్నీ చిరునవ్వుతో వింటూ చివర్న అంది.

"అసలు నువు చూడవలసినదీ, నేను చాలా రోజులుగా నీకు చూపించాలని వెయిట్ చేస్తున్నదీ మా ఇల్లుకాదు చిట్టి బాబూ."

పెరట్లో సర్వీ చెట్టుకింద తులసికోట చూస్తున్నాను. చిన్ని కోట. మట్టితో కట్టిన దది. అలికి, సున్నం ముగ్గులతో ఆ చల్లటి సర్వీనీడన ఆ తెల్లటి ముగ్గుల్లో విశ్రాంతి తీసుకోవాలనిపిస్తోంది. ఎంత ఆర్టిస్ట్! ఉత్త ఆర్టిస్టేనా?

"పద చూపిస్తాను" అంటూ దారితీసింది.

అయితే ఇవేవీ కావన్నమాట. ఇంత కంటె తన మనసుని దోచి నాతో పంచు కోవాలి అనిపించే ఆ ఆనందం - ఏమిటో? అదే అన్నాను పైకి.

"చూపిస్తావుగా!" అంటూ ఇల్లు దాటి కొద్ది దూరం నడిచింది.

దాదాపు రెండు వేల గజాల నేలలో కొంత మేర వంగతోట కొంత మేర మిరపతోట. మధ్యలో చిన్న దొరువు. ఆ దొరువు చుట్టూ వేపచెట్లు. తాటిచెట్లు, జీడి మామిడి పూల సౌరభం. అక్కడికి తీసుకు వెళ్ళి - "చూడు చిట్టీ! ఇప్పుడు" అంది.

చిన్నప్పుడు ఆటల్లో కళ్ళు మూసి ఎక్క డెక్కడో తిప్పి హఠాత్తుగా ఎక్కడో వది లేస్తే ఆ కాసేపూ ఎంతో వెలుగు - కళ్ళని పట్టనంత వెలుగులో— కళ్ళు కనపడేవికావు కాసేపటి దాకాను.

అలాగే ఇప్పుడూను. ఈ అందానికి కళ్ళు పట్టడంలేదు-కళ్ళు కనిపిస్తూనే ఉన్నా.

ఆ చిన్న దొరువునిండా ఎర్రకలువపూలు,

కిందికి దిగి తాకబోయేను. ఆ కదలికకి జల జల జలా దొరువంతా చేపలు నీళ్ళని కొన్ని వేలు, లక్షల అలలుగా మార్చేశాయి. చిన్ని, చిన్ని అలలు. వొళ్ళు ఝల్లుమంది నాకు.

తలెత్తి చూశాను. చుట్టూ బంతిపూలు— బొబ్బాసి చెట్లు—అక్కడ లేని మొక్కలేదు.

"ఏమిటిది? ఎవరిది? నీకెలా దొరికింది?" అన్నాను. "ఆగాగు అన్ని ప్రశ్నలా, ఇది మనదే, అంటే మనది కాదనుకో....కాని అందమంతా మనదే. ఇంటికొచ్చిన మర్నాడు వీర్రాజు పిలిచాడు. పిలిచి చూపించి రెండు కలువలు కోసి ఇవ్వబోయాడు వద్దని-కొయ్యనివ్వలేదు. "మీరేం కావా లంటే అవి తీసుకోండమ్మా. ఇది మీతోటే" అన్నాడు—" అంది.

"వివరంగా చెప్పవోయ్" అన్నాను.

"చూశావా! ఇది దొరువుగానే ఉండేదన్న మాట పూర్వం. దీంట్లో ఈ ఎర్ర కలువలు వేశాడు. వీటికి తోడు కోసం అన్నట్టు కాసిని చేపపిల్లల్ని తెచ్చి ఇందులో పోశాడట. అవి తామర తంపరై పోయాయి. ఇది కొలనయి పోయింది."



"ఏయ్! ఇంవాక కలువలన్నావు. మళ్ళీ తామరలంటున్నావేమిటి?"

"అవేనోయ్. పెద్ద చిక్కొచ్చింది మన 'కవి సమయాలతో'- ఇవి పొద్దునే పూసి మధ్యాహ్నానికి వాడిపోతున్నాయి- మళ్ళీ సాయంత్రంనించి విడుస్తున్నాయ్. అందుకే వీటినేమనాలో తెలీట్లేదు."

"ఇంతకీ వీర్రాజు సంగతి?"

"ఆ! వస్తున్నా" -సీరియస్‌గా అయిపోయింది.


ఇలాంటి మాటలు తను చెప్తుంటేనే వినాలి. చాలా గాఢంగా, గొప్పగా అనిపిస్తాయి.

"అతనికి భార్య లేదు చిట్టీ! ఇరవయ్యేళ్ళ క్రితం నించీ - అంటే ఈ తోట వేసినప్పటినించీ తెల్లవారి నేను లేచేసరికే ఆ పక్క దొరువులోంచి నీళ్లు తెచ్చి ఆ మొక్కలన్నీ తడుపుతూ వుంటాడు. ఆ కలువల దొరువులో కుండ ముంచడు.

ఏనాడు వేశాడో - ఆ గుప్పెడు చేపలు - అవి అలా పెరుగుతూనే వున్నాయి. కాని ఏనాడూ ముట్టుకోలేదట. అమ్ముకోవడానికి పచ్చిమిరపకాయలు కోసేటప్పుడు కూడా అతనికి చేతులాడవేమో అనిపిస్తుంది.

ఇంత (శ్రమైక) జీవన సౌందర్యాన్ని నేను భరించలేకపోయాను. నువు ఎప్పుడెప్పుడొస్తావో? చూపించాలని ఉవ్విళ్ళూరిపోయాను-"

ఇదెక్కడి పిల్ల? తను కొత్తగా కట్టుకున్న ఇల్లు చూపించాలని సరదాలేదేం? అని




పించలేదు నాకు— ఆ పిల్ల నా ఒక్కడికే తెలుసునన్న గర్వం ఉన్న నాకు.

"వింటున్నావా?"

"ఓ రోజు వంకాయలు కోసి ఇచ్చాడు. "తీసికెళ్ళి కూర వండండమ్మా! అప్పటికప్పుడు కోసిన కాయలు- కూర బావుంటుంది" అన్నాడు. దాదాపు రెండు కేజీల కాయలు. డబ్బులివ్వబోయాను. చాలా నొచ్చుకున్నాడు. "అమ్మా! నాకు కలిగింది ఇదే ఎక్కడో ఎలాగూ అమ్ముకోకతప్పదు. వద్దమ్మా" అంటూ.

చిట్టీ! మనుషుల్లో ఇంకా ఈనాడు డబ్బు పట్ల ఇంత నిరాసక్తత ఉందా?"

అలా చెప్తూనే వుంది. వెనక్కి వచ్చేశాం. నా కళ్ళలో ఆ ఎర్ర కలువలే. నా పళ్ళంతా ఆ అలల పులకింతే. నా మనసంతా లక్ష్మి చూపించిన ఆ శ్రమైక జీవన సౌందర్యమే.

వంకాయలూ, బీరకాయలూ తప్ప వాటికి నీళ్ళు పోసే చేతుల వెనక హృదయం ఎవరికి తెలుస్తుంది—? ! !

అందుకే లక్ష్మితో గడిపిన కాలం నాకు అమూల్యం. "జీవితంలో అన్నీ ఆలోచించగలగడం, అనుభవించగలగడం నువ్వే నేర్పావు కదా!" అంటుంది.

నిజమా?

ఋతువుల అందాలు, పూల వాసనలు,



# సమాచారమ్

## నెహ్రూ యువక కేంద్రం

చిత్తూరులోని నెహ్రూ యువక కేంద్రం మార్చి 12, 13, 14 తేదీలలో యువజనోత్సవాన్ని, జానపద కళల ఉత్సవాన్ని స్థానికంగా నిర్వహించారు.

## కృష్ణాజిల్లా రచయితల సభలు

మే నెల 7, 8 తేదీలలో విజయవాడలోని ముక్త్యాల వెంకటప్పయ్య మెమోరియల్ బిల్డింగ్స్‌లో కృష్ణాజిల్లా రచయితల ఆరవ మహాసభలు జరుగుతాయి. కవి సమ్మేళనం, మహిళా సదస్సు, వివిధ సాహిత్య ప్రక్రియలపై సమీక్ష, ప్రాచీన సాహిత్యం, తెలుగు సాహిత్యంలో శాస్త్రీయ దృక్పథం అంశాలుగా సదస్సులు జరుగుతాయి.

## కళింగ సాహిత్య సమ్మేళనం

చిక్కోలులో నూతనంగా నెలకొన్న యీ "కళింగ సాహిత్య సమ్మేళనం" కళింగ దేశపు రచయితల వివరాలతో గ్రంథ సంకలనం రూపొందిస్తున్నది. పిఠాపురం నుంచి ఋషికుల్య వరకుగల(నవయుగానికి[1875-1980] చెందిన రచయితలకు ప్రత్యేక ప్రాధాన్యంతో) సాహితీ వరుల వివరాలను, ఫొటోలు, వ్యాసాలు, స్వీయ రచనలు వగైరాలను డాక్టర్ గంటి శ్రీరామమూర్తి, ఉపాధ్యక్షుడు- కళింగ సాహిత్య సమ్మేళనం, వైస్ ప్రిన్సిపల్, ఎ. ఎమ్. ఎ. ఎల్. కాలేజి, అనకాపల్లి, అన్న చిరునామాకు పంపవచ్చు.

## మద్రాస్

## తెలుగు సంగీత అకాడమీ

ఏప్రియల్ 9న శంకరదాస్ ఆడిటోరియంలో శ్రీమతి డి. కె. పట్టమ్మాళ్ జ్యోతి వెలిగించి "మద్రాస్ తెలుగు సంగీత అకాడమీ"కి ప్రారంభోత్సవం జరిపారు. డాక్టర్ మంగళంపల్లి బాలమురళీకృష్ణ యీ సంస్థకు అధ్యక్షులు, ఫౌండర్. ప్రమోటర్ శ్రీ టి. వి. కె. శాస్త్రి స్వాగతంపలికారు. అకాడమీ లక్ష్యాన్ని డాక్టర్ బాలమురళి వివరించారు.

"మృదంగ విద్వాన్" శ్రీ కోలంక వెంకటరాజును శ్రీ పి. వి. రమణయ్యరాజా సత్కరించారు. అకాడమీ ఆయనకు "లయ విజ్ఞాన మార్తాండ" బిరుద ప్రదానం చేశారు. శ్రీ చిట్టిబాబు వీణావాద్యం ఆనాటి ప్రత్యేకాకర్షణ! కార్యదర్శి శ్రీ పి. బి. శ్రీనివాస్ వందన సమర్పణ చేశారు.

ప్రపంచంలోని సౌందర్యాన్ని చూడడం తనే నేర్పించని కదా నేననుకుంటాను.

* * *

రెండు రోజులు కాలేదు. ఈ సాయంత్రం తనని చూడాలని మనసు మహ ఆరాటపడిపోయింది. వుండలేక పోయాను. లోపల ఎక్కడో ఉన్నట్టుంది, బైట పలకరింపులు, మర్యాదలు మధ్య-

సన్నటి గాజు గిన్నెలో మామిడిపండు ముక్కలు- స్పూన్ వేసి తెచ్చింది.

మహా ప్రసాదం- అని మనసులో అనుకుని తీసుకున్నాను. ఒక్క ముక్క నోట్లో పెట్టుకున్నాను. "అమృతం! ఇదేమిటి-? టేస్ట్ మారిపోయింది-? అరె- ఏం ముక్కలివి-? బొబ్బాసి ముక్కలా?"— అన్నాను.

కళ్ళనిండా మెరుపులు - మొహమంతా ప్రఫుల్లం, ఆనందం హృదయ దఘ్నంగా వున్నట్లు, నిలువెల్లా ఆవరించినట్లు—

"వీర్రాజు తోటలోవి" — అంది.

అని — "ఎంత నిస్సంగత్వం చిట్టీ అతనిది! ముఖ్యమయిన వయసులోంచీ భార్య లేకుండా పోయింది. ఆ పూలు, ఆపూల మధ్య తిరిగే చేపలు— ఆ తోట— వీటి మీద ఎంత ప్రేమో ? - రవీంద్రుడి తపోవన సందేశం గుర్తొస్తోంది నాకు" అంది.

"కలువలు చూద్దామా?" అన్నాను. నాకు నిజానికి వీర్రాజునే చూడాలని వుంది.

"ఇప్పుడు ముడుచుకుపోతాయి- మరోసారి వెళదాం." అంది. అని "పదేళ్ళ పిల్ల- మనవరాలు-పండి తెస్తుంది. ఓ రోజు చూశాను. చిన్న ట్రాన్సిస్టర్లో పాటలు- ఆ తోటలో ఆ తాతకి మనవరాలి చేతి భోజనం. ఆడ దిక్కులేని సంసారం—"

అంటూనే కళ్ళనించి నీళ్ళు జలజలా రాలాయి.

"వద్దు లక్ష్మీ! తప్పు. మరీ ఇంత సున్నితమా?" కసిరాను.

లక్ష్మి నా దిక్కు, ఆడదిక్కు లేకుండా పోయిన నా కోసం- ఏడుస్తోందా?

లక్ష్య నిర్వహణకు కట్టుబడి "పోయిన" నాకు సంసారమా ? భారమైన మనసుతో వచ్చేశాను.

* * *

చాలా కాలానికి. ఏ బలమైన సిద్ధాంతాల దగ్గర మేమిద్దరమూ విడిపోయేమో అక్కడే కలుసుకున్నాం.

అయితే ఏం లాభం ?

మేం కలుసుకున్నా, కలిసిఉండలేనప్పుడు.

ఇలా మా లక్ష్యం ఒకటవడానికి ముందు- చాలా కాలానికి- లక్ష్మిని చివరిసారేమో అన్నట్టుగా చూడ్డానికి వెళ్ళాను.

చాలా దిగులుగా ఉంది. పలకరించడానికే భయం వేసింది.

"వచ్చావా! దా! కూచో" అంది.

చాలాసేపటికి నేనే అడిగాను.

"ఎర్ర కలువలు చూపించవా?"

తలెత్తింది.... ఎర్రబడిపోయిన కళ్ళనిండా నీళ్ళతో-

"చూస్తావా? దా!" అంటూ పెరట్లోకి తీసికెళ్ళింది

ఆశ్చర్యపోయాను. అక్కడ పూర్వం ఏముండేదో గుర్తు తెలీనంత మార్పు. రెండు అంతస్థుల మేడ, చుట్టూ పెద్ద ప్రహరీ.

"ఏమిటి లక్ష్మీ-? ఇది" అన్నాను.

"చిట్టీ! డబ్బుంటే ఎంత తక్కువ కాలంలో ఎంతెంత భవనాలు కట్టెయ్యవచ్చో చూశావా?" అంటూ- ఏడ్చేసింది.

చటుక్కున దగ్గిరికి తీసుకుని కళ్ళు తుడిచాను.

లక్ష్మి స్పర్శ. హృదయమంతా శాంతి, చల్లదనం. అగ్నిలా మండుతున్న నా హృదయం- ఇలా శాంతించేస్తుందనే- నేనిలా ఇంతదూరంగా మిగిలిపోయింది.

నెమ్మదిగా తేరుకుంది.

"ఓనాడు మధ్యాహ్నం ఆ పల్లని నీడలో- ఆ కొలను గట్టున ఇసుకలో పడుకుని శరత్‌బాబు "భారతి" చదివాను. ఎన్నోసార్లు! ఆనాడూ భారతిలాగే ఆలోచించాను. ఆ సవ్యసాచిని దూరంగానే నిలబెట్టాను. కాని- నా కళ్ళముందే ఇంత అన్యాయమూ జరిగిపోయింది."

"వీర్రాజు ఏడీ?"

"వున్నాడు. ఆ రోజు సాయంత్రందాకా ఉన్నాడు.

ఆ ఉదయమే వచ్చారు వాళ్ళు. వారం రోజుల ముందునుంచీ చెప్తున్నారట-చెట్లు కాయలన్నీ కోయించేసేరు. దారువులో తామరాకులు పూలతో సహా పీకేశారు. చేపలు పట్టేశారు. దొరువు పూడ్చేశారు. లారీలతో రాయి దిగింది."

"మరి అతనేం చేశాడు ?"

"ఏం చేస్తాడు చిట్టీ! మతిపోయినవాడిలా అలా ఆ మూల వేపచెట్టుకింద కూచున్నాడు. సాయంత్రం దాకాను. నాకు భయం వేసింది. "వీర్రాజూ! కొద్దిగా అన్నం తిను వచ్చి" అన్నాను. "వద్దు తల్లీ ఆకలిలేదు" అన్నాడు. ఋషిలా కన్పించాడు. అంతే! ఆ తర్వాత మళ్ళీ కన్పించలేదు."

నాకు మావయ్య గుర్తొచ్చాడు. జీవిత కాలం చాలా భాగం ఏజన్సీ అడవుల్లో గ్రామాధికారిగా గడుపుతున్న మావయ్య— తను అనేవాడు-"ఒరే అబ్బాయి! ఈ కొండవాళ్ళు ఋషీశ్వరులు రా! రాగ ద్వేషాలు లేవు వీళ్ళకి-" అని. ఆ కొండ జాతి వ్యవసాయ జీవనం చేస్తున్న ప్రజల ప్రేమాభిమానాలతో నిండిన తన అనుభవాలు- అలా

ఎన్నో రాత్రులు చెప్పేవాడు. ఆ నాడు ఎంత ఉత్తేజం-!

—"నాకు భూస్వామ్య దౌర్జన్యాలు. శ్రామికశక్తి— ఇవేవీ తెలియవు చిట్టీ! అలాగే నువ్వూ అర్థం కాలేదు. కాని—ఇంత అన్యాయం జరుగుతుంటే— ఎవరికీ ఇది అన్యాయంగా కూడా తట్టలేదు. నేను పిచ్చి దానిలా కనిపించేను తప్ప."— లక్ష్మినుంచి ఇంకా అడిగి తెలుసుకున్న విషయాలివి. ఇరవై యేళ్ళ క్రితం ఎవరివో పొలాలు—ఆ పొలాల్లో పనిచేసి జీవించిన వంశంలోవాడు వీర్రాజు. కొంత కాలం తర్వాత వాటిని సైట్స్ క్రింద విడదీసి అతితక్కువ ధరలో అమ్మకోవడం జరిగింది. అయితే ఈరోజు వందల రెట్లలో ఊహించనంతగా దాని ధర పెరిగింది.

ఎవరెవరో కొనుక్కున్నారు. చేతులు మారాయి. పాపం వీర్రాజుకి ఇవేమీ తెలియవు.

వీర్రాజు పెంచిన చేపలకి తెలీదు- చాలా కాలానికి నీళ్లలోంచి గట్టున పడ్డ చేపకి— వీర్రాజుకీ తేడా గుర్తించనిది లక్ష్మి ఒక్కతే.

"చిట్టీ! ఇంత ప్రాక్టికల్‌గా నాకు తెలిసే దాకా నిన్ను గుర్తించలేకపోయాను. నువు వీరుడివి-నేను నీ కోసమే పుట్టాననుకునే దాన్ని కాని నువు మాత్రం దేశం కోసం పుట్టావు. వెళ్లిరా!" అంది

వచ్చేస్తుంటే మామ్మగారు-పలకరించింది.

"బాపున్నావా? ఇంత దాకా ఎంతో భయంగా ఉండేది వంటరిగా ఉండడానికి. ఇప్పుడు గొప్ప నిశ్చింత. చూశావుగా. రెండంతస్థుల మేడ లేచింది. పైన ఇంటివాళ్లు వుండి కింద ఆఫీసుకి ఇచ్చారు పగలూ. రాత్రీ. ఈ స్కూటర్లు-జీపలు- ఎంతో సందడి- భయమన్నది లేదు —" అలా ఏదో చెప్తూనే ఉంది ఆవిడ.

ఆ మనుషుల మధ్యలో వీర్రాజు, లక్ష్మి లాంటి వాళ్ళెలా బతుకుతారు?

వీర్రాజుకు నా కన్నుల్లోనూ. లక్ష్మికి నా గుండెల్లోనూ ఎర్ర కలువల్ని చూపించనా???

# సుభాషితాలు

ప్రజలు ప్రభుత్వాన్ని సమర్థించాలిగాని ప్రభుత్వం ప్రజలను సమర్థించ గూడదు.

—గ్రోవర్ క్లెయివ్‌లాండ్

* * *

బంగారంలో ప్రతి సన్నని తీగకు విలువ వున్నట్లే. జీవితంలో ప్రతి క్షణానికి విలువ వున్నది.

—యాసన్

* *

దుఃఖితులను ఓదార్చమని భగవంతుడు కాలాన్ని నిర్దేశించాడు.

—జౌబర్ట్

* * *

ఏకాకిగా నిలిచి వుండేవాడే ఈ ప్రపంచంలోకెల్లా మహా బలవంతుడైన మనిషి.

—ఇబ్సెన్

* * *

లోభ మోహాలన్నిటి నుంచి మనిషిని కాపాడే శక్తి ప్రార్థన కుంది.

—-బెర్నార్డ్

* * *

ఆరోగ్యం కోసం మందుల్ని పరిమితంగా తీసుకుంటాం. పరిమితంగా భోజనం చేస్తే ఆరోగ్యంగానే వుంటుంది.

—స్కెల్టన్

* * *

పెద్దగా అరచి తన వాదాన్ని నమ్మించాలని చూసే వాని వాదం ఎప్పుడూ బలహీనంగా వుంటుంది.

—హెన్‌స్టైన్

* * *

గ్రీకు శిల్పాలన్నీ రేఖాగణిత ఫలితాలే.

—ఎమర్సన్

* * *

భ్రాంతిని అతిక్రమించడమే జ్ఞానం.

—జార్జి శాంతాయన

* * *

స్త్రీని స్త్రీగా గౌరవించడంకంటే స్త్రీ ఎక్కువగా ఏమీ కోరదు.

—టోనీ

సేకరణ:

అడుసుమిల్లి శ్రీలక్ష్మి, ఎత్తొండ


సులభముగా ఇంగ్లీషు మాట్లాడుటకు




బాలాజీస్ ఈసీ వే టు స్పీక్ ఇంగ్లీష్

బడిలో చదువుకునే విద్యార్థినీ, విద్యార్థులకు, ఇంగ్లీషు చదివికూడా వ్యాకరణ సంశయము గలవారికి. వ్యాకరణ దోషములు లేకుండా సరళముగా ఇంగ్లీషు మాట్లాడుటకు, వ్రాయుటకు, నేర్పించుటకు ఉపకరించే పుస్తకం!

ఉద్యోగులు, వ్యాపారస్థులు, ఇంగ్లీషులో ఎక్కువ పరిజ్ఞానము లేనివారికి తెలుగుద్వారానే వ్యాకరణబద్ధంగా ఇంగ్లీషు నేర్చుకొనుటకు ఇది ఒక మంచి సాధనము!

ఈ పుస్తకం చదవడం ప్రారంభించగానే మీతోబాటుగా ఒక ఉపాధ్యాయుడు తోడున్నట్లే భావించగలరు!

మీ ఊరిలోని అన్ని బుక్‌షాపుల లోను లభిస్తుంది. వెల. రూ.19-50

వివరములకు:
బాలాజీ పబ్లికేషన్స్
103 పైక్రాఫ్ట్స్‌రోడ్. మద్రాసు-600 014.

BALAJI PUBLICATIONS
103 PYCROFTS ROAD
MADRAS 600 014

devi arts